ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం, 5 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

దుర్గమ్మ సన్నిధిలో నెల రోజుల సందడి

విజయవాడ, జూలై 5 (ప్రజాస్వరం): విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఆషాడమాసోత్సవాలు ప్రారంభమవనున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే కాదు తెలంగాణ నుంచి కూడా భారీగా భక్తులు తరలివచ్చి అమ్మకు మొక్కులు చెల్లించుకుంటారు. ఆషాడమాసంలో ఆడపిల్లలు పుట్టింటికి చేరుకుంటారు. అలాగే దుర్గమ్మను కూడా తమ ఇంటి ఆడపడుచుగా భావించి చీరె, సారె, పూజ సామగ్రి సమర్పించనున్నారు భక్తులు. ఇలా అమ్మవారికి సారె పెట్టేందుకు వచ్చే భక్త బృందాలకు ఘనంగా స్వాగతం పలికేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. గర్భగుడిలో ఉన్న దుర్గమ్మను దర్శించుకుని ఆ తర్వాత మహా మండపంలో ఉన్న ఉత్సవ మూర్తికి సారె సమర్పించిన తర్వాత.. తమతో పాటూ వచ్చిన మిగిలిన భక్తులకు కూడా పసుపు కుంకుమ ఇచ్చిపుచ్చుకుంటారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, భవానీ దీక్షలు, శ్రావణమాసంలో నిర్వహించే ఉత్సవాల తర్వాత స్థానం ఆషాడమాసోత్సవాలదే. ఈ ఏడాది జూలై 6 న ప్రారంభమయ్యే ఆషాడమాసం ఆగష్టు 4 న ముగుస్తుంది. ఈ నెల రోజులు కొండపై పండుగ వాతావరణమే..

6 గ్యారెంటీలు కాదు.. ఆరుగురు ఎమ్మెల్సీలు



హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం): ఆరు గ్యారంటీలు కాదు.. ఆరుగురు ఎమ్మెల్సీలను చేర్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సీఎం రేవంత్ రెడ్డి, దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో.. బస్వరాజు సారయ్య, భానుప్రసాద్, బోగారపు దయానంద్, దండే విఠల్, ఎగ్గే మల్లేశం, ఎంఎస్ ప్రభాకర్ ఉన్నారు.

ఫైరింగ్.. చేజింగ్

ఓఆర్ఆర్‌పై పార్థీ గ్యాంగ్ హల్‌చల్..

వెంబడించిన పోలీసులు.. గాలిలో కాల్పులు

హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం): తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో వరుస దోపిడీలతో జనాన్ని గడగడలాడిస్తున్న పార్థీ గ్యాంగ్ శుక్రవారం తెల్లవారుజామున హైదారాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై హల్‌చల్ సృష్టించింది. చోరీకి పాల్పడి ఓఆర్ఆర్ మీదుగా పారిపోతున్న దొంగలను నల్లగొండ సీసీఎస్ పోలీసులు వెంబడించారు. పోలీసులపై పార్థీ గ్యాంగ్ పోలీసులపై కత్తులతో దాడి చేసింది. దీంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. దోపిడీలు, దొంగతనాలు, హత్యలు చేయడంలో ఆరితేరిన పార్థి గ్యాంగ్ ఇటీవల ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతోంది. దీంతో నల్గొండ జిల్లా పోలీసులు నిఘా పెంచారు. శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ పోలీసులకు ఓ వ్యాన్‌లో పార్థి గ్యాంగ్ ప్రయాణిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. దీంతో వెంటనే వారిని పట్టుకునేందుకు వెంబడించారు. చేజింగ్ చేస్తున్న క్రమంలో పెద్ద అంబర్‌పేట్ సమీపంలోని ఓఆర్ఆర్ వద్ద పార్థి గ్యాంగ్‌ను అడ్డగించిన పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే నిందితులు వారిపై కత్తులతో దాడికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది.

టీజీపీఎస్సీ ముట్టడి ఉద్రిక్తం

హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం): టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద బీఆర్ ఎస్ అనుబంధ విద్యార్థి సంఘం ఆందోళన చేపట్టింది. రహదారిపై బైఠాయించి విద్యార్థి నేతలు నిరసన తెలుపగా వారిని పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. బీఆర్ఎస్‌వీ నేత గెల్లు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిరుద్యోగ ఐకాస ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టిన వీరు.. ప్రధానంగా మూడు డిమాండ్లు చేస్తున్నారు. గ్రూప్ 2, 3 పోస్టులు పెంచి డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు. డీఎస్సీని 3 నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నారు. అక్టోబర్‌లో 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని కోరుతున్నారు.

మాట తప్పిన కాంగ్రెస్: హరీష్ రావు

నిరుద్యోగులు, విద్యార్థి నాయకులను అరెస్టు చేయడాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఖండించారు. శాంతియుత నిరసన తెలియజేసేందుకు వెళ్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులను నిర్బంధించడం దారుణమని అన్నారు. ప్రజాపాలనలో శాంతియుతంగా నిరసన తెలియజేసే హక్కు కూడా నిరుద్యోగులకు లేదా? అని ప్రశ్నించారు. ఇది ముమ్మాటికీ అప్రజాస్వామ్యపాలన అని.. పుస్తకాలు పట్టుకొని చదవాల్సిన విద్యార్థులను నడిరోడ్డుకు ఈడ్చి ధర్నాలు, ఆందోళనలు చేసే దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని విమర్శించారు.

నెక్స్ట్ ఎవరు?

లైన్‌లో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

ఢిల్లీ లెవల్లో తలసాని ప్రయత్నాలు

గ్రేటర్ పరిధిలో మరికొందరు కూడా!!

హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం): తెలంగాణలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో సీనియర్ నేతలతోపాటు, ఎమ్మెల్యేలు కూడా అధికార కాంగ్రెస్‌లో చేరేందుకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు హస్తం గూటికి వచ్చారు. కాంగ్రెస్‌లో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేల చేరిక దానం నాగేందర్‌తో మొదలై.. తెల్లాం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్ కుమార్, కాలె యాదయ్య కాంగ్రెస్ లో చేరారు. మరోవైపు గురువారం ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా కాంగ్రెస్ లో చేరారు. రానున్న రోజుల్లో మరికొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతారన్న టాక్ వినిపిస్తుంది. జులై 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనుండటంతో.. ఈ లోపే కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున చేరికలు ఉండే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే పలువురికి కాంగ్రెస్ పెద్దల నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా తీసుకున్నారని టాక్. ఈ క్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఇప్పటికే కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమయ్యారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య అలకతో ఆయన చేరికకు చివరి నిమిషంలో బ్రేక్ పడింది. ప్రస్తుతం జడ్పీ చైర్‌పర్సన్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో కృష్ణమోహన్ రెడ్డికి లైన్ క్లియర్ అయింది. అలాగే, గ్రేటర్ పరిధిలో మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సైలెంట్‌గా పావులు కదుపుతున్నారని తెలుస్తున్నది. అందుకోసం ఇండియా కూటమిలో కీలకంగా ఉన్న సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ద్వారా కాంగ్రెస్ హైకమాండ్తో మంతనాలు జరుపుతున్నారని ప్రచారం జరుగుతున్నది. ఆయనతో పాటు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేరిక ఖాయమైంది.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

రంగారెడ్డి, జూలై 5 (ప్రజాస్వరం): బాలాపూర్ కు చెందిన భాగ్య నగర్ రైతు సేవ సహకార సంఘం డైరెక్టర్ పెద్ద నరసింహారెడ్డి కొడుకు జస్వంత్ రెడ్డి మద్యం మత్తులో ఒక యువకుని చితకబాదిన వైనం ఇది. వాహనం పై ఎమ్మెల్యే స్టిక్కర్,సైరన్ వేస్తూ పట్టపగలే రోడ్డుపై అందరూ చూస్తూనే విచక్షణ కోల్పోయి దాడికి తెగబడ్డారు. బూతులు తిడుతూ,రెండుసార్లు సాయి కుమార్ పై దాడికి తెగబడ్డారు దీంతో రోడ్డు పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డది. రోడ్డు పై వెళ్లేవారు చెప్పిన వినకుండా దాడికి దిగారు. బాధితుడు మీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

మల్లారెడ్డికి మరో షాక్

హైదరాబాద్, జూలై 5 (ప్రజాస్వరం): మాజీ మంత్రి మల్లారెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఎలాంటి అనుమతులు లేకుండా బాలానగర్‌లో ఏర్పాటు చేసిన మల్లారెడ్డి యూనివర్సిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కామర్స్ అండ్ డిజైన్ (ఆఫ్ క్యాంప్స)పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), రాష్ట్ర ఉన్నతవిద్యామండలికి ఆదేశాలు జారీచేసింది. రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ, యూజీసీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మల్లారెడ్డి యూనివర్సిటీ ఆఫ్‌క్యాంపస్ ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ నవీనా ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రతిభా డిగ్రీ కాలేజ్, ఏ మనోహర్ తదితరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిని విచారణకు స్వీకరించిన జస్టిస్ నీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. ప్రతివాదులైన మల్లారెడ్డి యూనివర్సిటీ, ఆఫ్‌క్యాంప్‌సకు వ్యక్తిగత నోటీసులు అందజేయాలని ఏప్రిల్ 25న పిటిషనర్ తరఫు న్యాయవాదికి ఆదేశాలు జారీచేసింది.

మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రతినిధులు నోటీసులు స్వీకరించినా మల్లారెడ్డి వర్సిటీ ఆఫ్‌క్యాంపస్ ప్రతినిధులు మాత్రం నిరాకరించారు. ఈ అంశంపై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నోటీసులు తిరస్కరించినా అందినట్లుగానే భావించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వాదనను రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహా ఇతర అధికారిక ప్రతివాదులెవరూ వ్యతిరేకించలేదు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఆఫ్‌క్యాంపస్ సెంటర్‌పై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 24కు వాయిదా వేసింది.

ప్రభుత్వ ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

వరంగల్, జూలై 5 (ప్రజాస్వరం): వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన రంజిత్ పలుపోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాలేదు. 2 రోజుల కిందట కడపలోని స్నేహితుడు ప్రశాంత్ రెడ్డి అక్క పెళ్లికి వచ్చాడు. లాడ్జిలో స్నేహితులతో కలిసి బస చేశాడు. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చలేదని సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాని పోలీసులు తెలిపారు.